

● నగరంలో మొదటి బహుమతి పొందిన ముగ్గు



● రెండో బహుమతి..



● మూడో బహుమతి..



జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

సప్తవర్ణ శోభితం

- 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీకి విశేష స్పందన
- రంగుల హరివిల్లుగా మారిన పాత కలెక్టరేట్ మైదానం
- ఆటపాటలతో ఉత్సాహంగా సాగిన ముగ్గుల పోటీలు
- నిజామాబాద్‌లో ముఖ్య అతిథిగా ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హాజరు
- బోధన్‌లో హాజరైన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ముత్యాల ముగ్గుల పోటీ విజేతలు వీరే..

- నిజామాబాద్‌లో ప్రథమ బహుమతి పొందిన హీరావాసం
- ద్వితీయ బహుమతి పొందిన భవాని
- తృతీయ బహుమతి పొందిన పూజిత
- బోధన్‌లో ప్రథమ బహుమతి పొందిన లావణ్య
- ద్వితీయ బహుమతి పొందిన లత
- తృతీయ బహుమతి పొందిన రాణి



● ప్రథమ బహుమతి అందజేస్తున్న తాహెర్‌బిన్ హందాన్

● నగరంలో..



నిజామాబాద్ కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)'ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలు సప్తవర్ణాల శోభితంగా సాగాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాన్ని ప్రతిబింబింపజేసే విధంగా మహిళలు ముగ్గులు వేశారు. జిల్లా కేంద్రం లోని పాత కలెక్టరేట్ మైదానంలో ఎస్ఎస్ఆర్ కళాశాల సౌజన్యంతో నిర్వహించిన సంతూర్ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. పల్లె వాతావరణాన్ని పండుగలో ఔనత్యాన్ని చాటి చెబుతూ మహిళలు ముగ్గులు వేశారు. భావిత రాల వారికి ముగ్గుల ప్రాధాన్యతను తెలుపుతూ చుక్కల ముగ్గులు వేసి అందులో వివిధ రంగులను నింపి సృజనాత్మకత ప్రదర్శించారు. ముగ్గుల పోటీ సాగినంత సేపు మహిళలు తమ ముగ్గులలో తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంక్రాంతి పర్వదినం విశేషాలను చూపారు. యువతులు సైతం గృహిణులకు పోటీగా చుక్కల ముగ్గులతో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

పల్లె వాతావరణాన్ని గుర్తు చేశాయి..

: తాహెర్‌బిన్ హందాన్, ఉర్దూ అకాడమీ చైర్మన్



నగరంలో ముగ్గులను పరిశీలిస్తున్న ముఖ్య అతిథులు

సంక్రాంతి పర్వదినం వచ్చిందనగానే పల్లెల్లో ప్రతి ఇంటి ముందు ముగ్గుల మయంగా ఉండేదని తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్క రించుకొని నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేశాయన్నారు. ప్రపంచానికే భారతదేశం ఆదర్శంగా నిలవడానికి సంస్కృతి సంప్రదాయాలే కారణం అని అన్నారు. మహిళలు ప్రతి ముగ్గులో పండుగ విశిష్టత ను తెలుపుకుంటూ నైపుణ్యాన్ని సృజనాత్మకతను చూపారని అన్నారు. పండుగ వచ్చిందంటే ముగ్గులతో పాటు గంగిరెద్దులను తీసుకొని గ్రామాల్లో తిరుగుతుంటే ఆ పండుగ అనుభూతి ఎంతో గొప్పగా ఉండేదని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి మహిళల కోసం ఇలాంటి పోటీలు పెట్టడం అభినందనీయమని అన్నారు. మహిళలకు ఇలాంటి పోటీలు పెట్టడం వల్ల సామాజిక విషయాలు తెలుస్తాయని వారిని ప్రోత్సహించిన వాళ్లము అవుతామన్నారు. ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ జిల్లాకు చెందిన వారు కావడం ఆనందంగా ఉందని అన్నారు.

సంప్రదాయాలకు ఆడపిల్లలు వారసులు..

: శారద హన్మాండ్లు, రచయిత్రి


ఆస్తికి మగవారు వారసులైతే సంస్కృతి సంప్రదాయాలకు ఆడపిల్లలు వారసులని ముత్యాల ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన రచయిత్రి శారద హన్మాండ్లు అన్నారు. ఆడపిల్లలు మగవారితో

మిగతా 8వ పేజీలో...

ప్రతి ఒక్కరూ సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించాలి

● ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి

బోధన్ రూరల్/కోటగిరిప్ (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బోధన్ పట్టణంలో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, ఇందూరు విద్యాసంస్థల కరస్పాండెంట్ కొడాలి కిషోర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల ఆవరణలో మహిళలు వేసిన రంగవల్లులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ యాజమాన్యం సంస్కృతి సంప్రదాయాలను పెంపొందించే విధంగా ముగ్గుల పోటీల రూపంలో ఏటా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కొందరు మహిళలు బోధన్ ప్రగతిని చాటి చెప్పేలా నిజాంషుగర్ ఫ్యాక్టరీ, ఎడ్ల బండి, నవధాన్యాలు, సమాజంలో మహిళల ప్రాముఖ్యతను వివరిస్తూ వేసిన ముగ్గులు తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చాయని ఎమ్మెల్యే కొనియాడారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ వెంకటేశ్వర స్టీల్స్ జనరల్ స్టోర్ యజమాని నర్సయ్య సేట్ కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ అంకు సంధ్యాదాము, ఏసీపీ శ్రీనివాస్, లయన్స్ గవర్నర్ లక్ష్మీ బసవేశ్వర్, నాగేశ్వర్‌రావు, ఆదినారాయణ, న్యాయనిర్ణేతలు సంధ్యా, రమాదేవి, ఉపాధ్యాయులు కాట్రగడ్డ భారతి, లావణ్య కిషోర్, స్వాతి, సంధ్యారాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.



బోధన్‌లో ప్రథమ బహుమతి విజేతకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



బోధన్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, న్యాయనిర్ణేతలు



మూడో బహుమతి పొందిన ముగ్గు



రెండో బహుమతి పొందిన ముగ్గు

బోధన్‌లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు



రేపు కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ స్థాయీ సంఘ సమావేశం

హాజరుకానున్న రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ

పీసీసీ అధ్యక్షుడు, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు

నిజామాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్లమెంటరీ స్థాయీ సంఘ సమావేశం ఈనెల 7న జరగనుంది. డిచ్‌పల్లిలో మంగళవారం నిర్వహించే ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు అన్వేష్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, కాసుల బాల్‌రాజు, జిల్లా నేతలతో పాటు జగిత్యాల జిల్లాకు చెందిన నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధంతో పాటు పలు అంశాలపై చర్చించనున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కీలకమైన ఇతర పోస్టులపై దృష్టిపెట్టి పోటీలో నిలబడేందుకు పార్టీ తరఫున కీలక నేతలను ఎంపిక చేయనున్నారు. ముందస్తుగా సమావేశాలు నిర్వహించడంతో పాటు పార్టీ క్యాడర్ అంతా ఎన్నికలకు సమాయత్తం అయ్యేందుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. సర్పంచ్ ఎన్నికలు పార్టీ రహితంగా జరిగినా.. తమ పార్టీ బలపర్చిన వారు ఎన్నికయ్యే విధంగా క్యాడర్‌కు దిశా నిర్దేశం చేయనున్నారు. మండల పరిషత్‌లు, జడ్పీని కైవసం చేసుకునే విధంగా సమావేశంలో చర్చించనున్నారు. కీలకనేతలు హాజరుకావడంతో పాటు పదేళ్లలో పార్టీ కోసం పనిచేసిన వారికి కీలక పదవులు, ఎన్నికల్లో పోటీ వంటి అంశాలపై చర్చించనున్నారు. పార్టీ సీనియర్ నేతలు హాజరయ్యే ఈ సమావేశంలో కీలకమైన అంశాలను చర్చించనున్నామని జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘాల లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. అన్ని స్థాయిలోని నేతలు హాజరవుతారని ఆయన తెలిపారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నాం

● నాలుగు శాతం ముస్లిం రిజర్వేషన్ల రద్దుకు కుట్ర జరుగుతుంది ● సావిత్రీబాయి పూలే జయంతిలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

నిజామాబాద్ అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌లో భాగంగానే కులగణన చేపడుతున్నామని అది పూర్తయిన వెంటనే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో బీసీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా 120 మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నగర మేయర్ దండు నీతూకిరణ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, తదితరులు పాల్గొని మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడిగా బీసీకి అవకాశం కాంగ్రెస్ పార్టీ కల్పించిందని అలాగే రాష్ట్రంలో కులగణన నిర్వహించడంతో పాటు హాస్టల్ విద్యార్థులకు ఒకేసారి 40 శాతం మెస్ చార్జీలను పెంచామన్నారు. సావిత్రీ బాయి పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిందన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని కోఠి



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ



ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

మహిళా కళాశాలకు చాకలి ఐలమ్మ పేరు పెట్టడం హర్షనీయమని అదేవిధంగా సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం ఈ ప్రభుత్వ చరిత్రాత్మక నిర్ణయమన్నారు. బీసీల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని బీసీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. సావిత్రీ బాయిపూలే దంపతుల విగ్రహాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లు తీసుకొచ్చి బీసీ మహిళలకు అన్యాయం చేసిందన్నారు. రాబోయేది బీసీల రాజ్యమేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ నీతూకిరణ్, నుడా చైర్మన్ కేశవేణు, మాజీ జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, బీసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, గోపాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్లను రద్దుకు కుట్ర జరుగుతుంది : షబ్బీర్ అలీ

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ముస్లింలకు ప్రస్తుతం కల్పిస్తున్న రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కుట్ర జరుగుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు ఎంత ప్రయత్నించినా ముస్లింల

మిగతా 8వ పేజీలో...

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

సుభాష్‌నగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5 నుంచి 9 వరకు మహారాష్ట్రంలోని జల్గావ్ శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్ స్టేడియంలో జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్ జాతీయ సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలబాలికల పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగమణి తెలిపారు. బాలికల విభాగంలో ఎస్.నిత్యశ్రీ (జడ్పీ హెచ్‌ఎస్, తొర్లికొండ), డి.అశ్విని (జడ్పీహెచ్‌ఎస్ ముచ్కూర్), జి.సాత్విక, జి.శ్రావిక (టీఎస్‌డబ్ల్యు ఆర్‌ఎస్ బాలికల సుద్దపల్లి), బాలుర విభాగంలో ఎం.నిఖిల్‌చంద్ర (నారాయణ హైస్కూల్ ఆర్మూర్), ఎస్.సిద్ధార్థ (సత్యశోధక్ పాఠశాల సిరికొండ), లక్ష్మేందర్ కుమార్ (టీఎస్‌డబ్ల్యుఆర్‌ఎస్ బోధన్), ఎన్.ప్రణయ్ (టీఎస్‌డబ్ల్యు ఆర్‌ఎస్ ఉప్పల్వాయి)లు ఎంపికయ్యారు. కోచ్ మేనేజర్లు మర్కంటి గంగా మోహన్, వినోద్, ప్రశాంత్‌కుమార్, అంజలి వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

ఫటా.. ఫట్...

యాసంగిలో 9800 ఎకరాల సాగుకు ప్రణాళిక

● నిజాంసాగర్ వ్యవసాయశాఖ అధికారి అమర్‌ప్రసాద్



యాసంగిలో 9,800 ఎకరాలసాగుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మండల వ్యవ్యవసాయశాఖ అధికారి అమర్‌ప్రసాద్ ఆంధ్రజ్యోతిపేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన పంటల సాగు గురించి వివరాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: ఈయాసంగిలో మండలంలో ఎన్ని ఎకరాల్లో పంటలను సాగు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు?

ఏవో: మండలంలో ఈయాసంగిలో 9,800 ఎకరాలలో సాగు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. రైతులు 95శాతం వరిపైరు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో యాసంగిలో ఆరుతడి పంటలు ఎన్ని ఎకరాల్లో వేశారు?

ఏవో: మండలంలో యాసంగిలో 1800 ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న,శనగ పంటలు వేశారు.

ఆంధ్రజ్యోతి: రైతుభరోసా పథకం కింద ఎంత మంది రైతులకు అర్హులై ఉన్నారు?

ఏవో: మండలంలో రైతు భరోసా పథకానికి 5,620 మంది రైతులు అర్హులని ప్రభుత్వం వీరందరికీ రైతు భరోసా ప్రణాళిక సిద్ధంగా ఉంది.

ఆంధ్రజ్యోతి: నిజాంసాగర్ ప్రాజెక్టు పనులు నిజాంసాగర్ మండలం ఆయకట్టు ఎంత ఎన్ని గ్రామాలకు సాగు నీరు అందుతుంది?

ఏవో: నిజాంసాగర్ మండలంలో నిజాంసాగర్ ఆయకట్టు కింద 900 ఎకరాలకు సాగు నీరు అందుతుందని నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా అచ్చంపేట, అరేపల్లి, బంజపల్లి గ్రామాలకు తాగునీరు అందుతుంది.

ఆంధ్రజ్యోతి: రైతు భరోసా పథకం కింద ఇప్పటి వరకు ఎంత మంది రైతులకు బీమా చెల్లించారు. ఇంకా ఎంత మంది రైతులకు చెల్లించాలి?

ఏవో: నిజాంసాగర్ మండలంలో ఇప్పటి వరకు 526 మందికి రైతు భరోసా పథకం కింద ఐదు లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందని, మరో రైతులకు రైతు బంధు చెల్లించేందుకు ఎల్‌ఐసీకి సిఫారసు చేయడం జరిగింది.

● (ఆంధ్రజ్యోతి, నిజాంసాగర్)

ఎస్‌జీటీ నూతన కమిటీ ఎన్నిక

బాన్సువాడటౌన్,జనవరి 5(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండల ఎస్‌జీటీ సంఘం నూతన కమిటిని ఆదివారం ఎన్నుకున్నట్లు అయ్యాల సంతోష్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా పవార్‌హిరాలాల్, ప్రధానకార్యదర్శిగా పొతుగంటి హనుమాండ్లు, కోశాధికారిగా శ్రీనివాస్‌నాయక్, ఉపాధ్యాక్షులుగా రాథోడ్‌సంజయ్, నంద్యాల రవి, అందేపండరి, రమేష్‌నాయక్, కార్యనిర్వహక కార్యదర్శి అజ్మీరా విఠల్, కర్రోళ్ల శ్రీకాంత్, దశరథ్, శ్రీకాంత్‌రెడ్డి, సభావత్ లక్ష్మన్,అమృత్ శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌జీటీ సమస్యల పైన పోరాటం చేసి సమస్యలు పరిష్కరించేవిధంగా కృషిచేస్తానని మండల అధ్యక్షుడు తెలిపారు.ఈ కార్యక్రమంలోసత్యనారాయణ, పర్వయ్య, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విరాళం

మాచారెడ్డి,జనవరి 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని చుక్కపూర్ గ్రామంలో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం రూ.10 వేల విరాళాలు పలువురు భక్తులు అందించినట్లు ఆలయ పూజారులు తెలిపారు.ఇస్సానగర్‌కు చెందిన విజయలక్ష్మీరూ.5001,నిజామాబాద్‌కు చెందిన ధన్నేవార్ అమృతరావులు రూ.5001లను విరాళంగా అందించారని తెలిపారు.

శబరిమలైకి తరలివెళ్లిన అయ్యప్పస్వాములు

భిక్కనూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలం రోజుల పాటు ఎంతోభక్తితో దీక్ష చేపట్టిన అయ్యప్ప స్వాములు ఆదివారం మాల విరమణకు శబరిమలైకి తరలివెళ్లారు. ముందుగా అయ్యప్ప ఆలయంలో స్వామివారికి గురుస్వాములు సుబ్బారావు, గంగాగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అయ్యప్పస్వాములు 20 మంది ఇరుముడితో ప్రత్యేక వాహనాల్లో శబరిమలైకి తరలివెళ్లారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

ఆర్మూర్‌రూరల్, జనవరి5(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో ఆదివారం ఏబీవీపీ జిల్లా మాజీ కన్వీనర్ కలిగోట శ్రీనివాస్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధిని చూసి తాము కాంగ్రెస్ పార్టీలో చేరామని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు విజయ్ అగర్వాల్,పట్టణ ఉపాధ్యక్షుడు అల్లాపూర్‌కిరణ్, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోటగిరి,జనవరి5(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని భీముని గుట్ట తండా గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గైని పవన్(22)అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు. నాగేంద్రపూర్ గ్రామానికి చెందిన పవన్ ఉదయం పొలంలో స్ప్రే మందు పిచికారి చేయడానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కోళ్ల ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న పవన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి గాయాల పాలైన పవన్ చికిత్స నిమిత్తం 108లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి తండ్రి షైనయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

● ఐదుగురి వ్యక్తుల అరెస్టు.. రూ.9400 స్వాధీనం

రెంజల్,జనవరి5(ఆంధ్రజ్యోతి):రెంజల్ మండల కేంద్రంలోని సొసైటీ గోదాం వెనుకల రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు ఎస్‌ఐ సాయన్న ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.9400లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందించాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

నేటి నుంచి బాల్కొండ మోడల్ స్కూల్ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

ముప్కాల్, జనవరి5(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ 6, 7, 8, 9 తరగతులకు విద్యార్థుల నుంచి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీనివాస్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26సంవత్సరానికి గాను ఖాళీ ఉన్న సీట్ల కోసం ఈనెల 6నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూ చించారు. మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష మార్చి 13వ తేదీన నిర్వహిస్తారని తెలిపారు. మోడల్ స్కూల్‌లో నాణ్యమైన బోధనతో పాటు ఇంగ్లీష్ మీడియంలో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారని, ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తలు, రుచికరమైన మధ్యాహ్న భోజనం ఉంటుందని ఆయన తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సాలూరాలో సహకార సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



నాళేశ్వర్‌లో గోదాంను ప్రారంభిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

సాలూర, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం సాలూర మండల కేంద్రంలో వ్యవసాయ సహకార సంఘ గోదాం, సాలంపాడ్ గ్రామాల్లో వ్యవసాయ సహకార సంఘ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘాల్లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులోకి ఉంచాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. రైతులకు మెరుగైన సేవలను అందించడం కొరకే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్నీ విధాలుగా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దు అకాడమీ చైర్మెన్ తాహెర్‌బిన్ హందాన్, గ్రంథాలయ చైర్మెన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, డైరెక్టర్లు గిర్దావర్ గంగారెడ్డి, జి.శరత్, సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్యాదాము, వైస్‌చైర్మెన్ చీల శంకర్, మండల అ ధ్యక్షుడు మందర్న రవి, నాగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ సంగెపు భూమయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇల్తెపు శంకర్, అల్లె రమేష్, ఖాజాపూర్ అశోక్, ఇల్తెపు రమేష్, సురేష్ పటేల్, డిస్కో సాయిలు, సొక్కం రవి, మైదపు నాగరాజు, కెజి గంగారాం, సొసైటీ సీఈఓ బస్వంత్‌రావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

● క్రీడలు శారీరక ధారుడ్యానికి ఉపయోగపడతాయి

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుడ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం సాలూర మండల కేంద్రంలో సొసైటీ చైర్మెన్ అల్లె జనార్ధన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా ప్రతిఏటా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తూ గ్రామాల్లోని యువకుల్లో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడం అభినందనీయమని ఈ సందర్భంగా కొనియాడారు. క్రికెట్ ఆడుతూ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోటోర్నమెంట్ నిర్వాహకులు,క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని బినోల సొసైటీ ఆధ్వర్యంలో నాళేశ్వర్, లింగాపూర్‌లలో నూతనంగా నిర్మించిన ఎరువుల గోదాంలను ఆదివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాళేశ్వర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి రూ.7లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాళేశ్వర్‌లో నూతనంగా గ్రంథాలయం ఏర్పాటుతో పాటు పశువైద్య శాలలో పశువైద్యుడిని నియమిస్తామని, పెండింగ్‌లో ఉన్న తుంగిని నుంచి నాళేశ్వర్ వెళ్లే రోడ్డును పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు నాళేశ్వర్‌లోని రాజరాజేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతిరెడ్డి రాజిరెడ్డి, బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, వైస్ చైర్మన్ బాబర్, నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంచందర్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, నర్సింగ రావు, మానికేశ్వర్ రావు, బాలచందర్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు సరిన్, సాయిలు తదితరులున్నారు.

నియోజకవర్గాలు వేరైనా మానాల గ్రామాభివృద్ధికి కృషి చేస్తా..

కమ్మర్‌పల్లి, జనవరి 5:(ఆంధ్రజ్యోతి) రాజన్న సిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామం మడల, పంచాయతీపరంగా వేములవాడ నియోజికవర్గం పరిధిలోకిరాగా, ఎమ్మెల్యే బాల్కొండ, ఎంపీ నియోజికవర్గం నిజామాబాద్ పరిధిలోకి వస్తుందని మానాల గ్రామాన్ని అభివృద్ధి పర్చడం ఇద్దరి బాధ్యత అవుతుందని తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ అన్నారు. మానాల గ్రామానికి చెందిన గతంలో ఏకగ్రీవ మాజీ సర్పంచ్, మూడు జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి మలోత్ నరహరి నాయక్ పదవీ విరమణ కార్యక్రమాన్ని తన స్వగ్రామం మానాలలో జరుపుకోగా ఆది శ్రీనివాస్ తోబాటు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ , జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాష్ట్రసహకార లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, వివిధ జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరహరినాయక్ మానాల గ్రామ సర్పంచ్‌గా టౌన్‌ప్లానింగ్ అధికారిగా అందించిన సేవలను కొనియాడారు. అనంతరం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మారుమూల గ్రామాల అభివృద్దే ధేయంగా అభివృద్దిద చేశామని మానాల మారుములగ్రామ మైనప్పటికి పట్టణ స్థాయి లో రహదారులు అంర్గత రహదారులు, తాగు సాగునీటివనరులు సమకూర్చి అభివృద్ధి చేశానన్నారు. గ్రామానికి గిజన ఆశ్రమపాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మంజూరి చేయిచుకుని పక్కాభవనాలు నిర్మిపజేశామని త్వరలోనే వాటిని ప్రారంభించుకునే ఏర్పాటు జరుగుతున్నాయన్నారు. తాను అధికారంలో లేకపోవడంలో కొన్ని మిగిలిపోయిన అభివృద్ధిపనులు చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, జిల్లా పార్టీ అధ్యక్ష్యుడు మానాల మోహన్ రెడ్డి పైన ఉటుందని గుర్తు చేశారు. ఈ అభివృద్ధిలో నరహరి నాయక్ పట్టుదల ఎంతో ఉందని గుర్తుచేశారు. పదవివి రమణ స్వగ్రామంలో ఆత్మీయుల మధ్య జరుపుకోవడం అనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మానాల అభివృద్ధిపై దృష్టిసారించాలని శేషజీవితం పట్టణంలో కాకుండా స్వగ్రామంలో గడుపుతు అటు తల్లిదండ్రుకు ఇటు స్వగ్రామానికి తమవంతు సేవలందించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి కోరారు. అనంతరం పదవి విరమణ పొందిన నరహరి నాయక్ దంపతులను శాలువలతో ముఖ్యఅతిదులు,ఆత్మీయులు, కుటుంబసభ్యులు, వివిద జిల్లా , గ్రామానికి చెందిన వివిద శాఖల అధికారులు శాలువలు గజమాలలతో ఘనంగ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానాలతో పాటు వివిద గ్రామాల తాజా మాజీ ఎంపీపీలు, సర్పంచ్ , ఎంపీటీలు సహకార సంఘాల చైర్మన్‌లు బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి

పిప్రిలో నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌రూరల్, జనవరి5(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నూతన సంవత్సర కానుకగా రైతుల అభివృద్ధికి, పేదల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, మండల అధ్యక్షుడు రోహిత్‌రెడ్డిలు మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి పథకంలో భాగంగా అన్నదాతలకు అందజేస్తున్న పెట్టుబడి సహయాన్ని రూ.6వేల నుంచి రూ.10 వేల వరకు పెంచడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అదే విధంగా దేశవ్యాప్తంగా పేదప్రజల సౌకర్యర్థం రూ.2కోట్ల ఇళ్ల నిర్మాణానికి సర్వే నిర్వహించడం సంతోషకరమన్నారు. పేదప్రజలు, రైతుల శ్రేయస్సు కోసం ఆహర్నిశలు పాటుపడుతున్న ప్రధాని నరేంద్రమోదీకి ప్రజలందరు అండగా నిలవాలని కోరారు. ఈకార్యక్రమంలో కేసీ.ముత్తెన్న, రవి, పండరి, భూషణ్, కృష్ణ, ప్రీతం, దేవారెడ్డి, భోజన్న, ఉదయ్‌గౌడ్, పీర్‌సింగ్‌నాయక్, దాసరి గోపి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ముప్కాల్, జనవరి5(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలో బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు చేయించిన ఈరవత్రి అనిల్‌కు బాధిత కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ముస్కు మోహన్, అబ్రార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

● బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..

బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్‌కు చెందిన బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కావడంతో బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గడ్పంద అనిల్, గడ్పంద ప్రదీప్, ఎంబరి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ వెంకట రమణ తెలిపారు. ఉదయం 10గంటలకు మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేతుల మీదగా ఈ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మండలంలో 72మందికి సంబంధిత చెక్కులు మంజూరయ్యాయని ఆయన వివరించారు.



ముప్కాల్‌లో బాధిత కుటుంబానికి చెక్కును పంపిణీ చేస్తున్న నాయకులు

మరిమడ్ల రహదారి పరిశీలన



మానాల మరిమడ్ల రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, జనవరి 5:(ఆంధ్రజ్యోతి) మానాల గిరిజన గ్రామాల ప్రజల చిరకాలకోరిక మరిమడ్ల రహదారి పనులను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం సందర్శించి పరిశీలించారు. తగ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎ కేసీఆర్‌ను ఒప్పించి ఫారెస్టు క్లియరెన్స్ చేయించి రెండు గ్రామాల మధ్య గిరిజనుల బంధుత్వాలను మరింత మెరుగుపర్చేవిధంగా మానాల మరిమడ్ల రహదారిని మంజూరు చేయిచి పనులను సైతం ప్రారంభించామని ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోగా ఎడాదిక్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తట్టెడు మట్టి పోసిన పాపాన పోలేదని విమర్శించారు, ఇప్పటికైన పనులు త్వరితగతిన ప్రారంబించి గిరిజనుల ఆశాలు చిగురింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మానాల అడ్డబోరుతండా, గైదిగుట్ట తండాబడితండా, సర్పంచ్‌తండా తదితరగ్రామాల్లో పర్యటించి బాధితకుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట ఆ యా గ్రామాల మాజీసర్పంచ్‌లు ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

ఆర్మూర్‌రూరల్, జనవరి5(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్, కొటా ర్మూర్‌లోని విశాఖనగర్‌లో శ్రీరామసత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం నూతన ఆలయ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఉదయం నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షునిగా లోక దయాకర్‌రెడ్డి, ప్రధానకార్య దర్శిగా లిక్కి గంగాధర్, కోశాధికారిగా రాజలింగం, ఉపాధ్యక్షులుగా హరి ప్రసాద్, ప్రధానకార్యదర్శిగా జక్కుల మోహన్, సంయుక్త కార్యదర్శులుగా రంగు నవీన్‌లను ఎన్నుకున్నట్లు ఆలయ కమిటీ శాశ్వత అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులు రెండేళ్ళ పాటు పదవీ బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నూతన ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ హైందవ ధర్మాన్ని కాపాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో బెన్కి నారాయణ, శంకర్, రాజేశ్వర్, దీపక్‌కుమార్, సతీష్‌రెడ్డి, బోజారెడ్డి, రాజేంధర్‌గౌడ్, అశోక్, సంజయ్ గౌడ్, ఆలయ అర్చకుడు గౌతమ్‌పాండే, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో పతకాన్ని సాధించిన దోమకొండ గడికోట ఆర్చరీ క్రీడాకారుడు

దోమకొండ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో దోమకొండ గడికోటకు చెందిన ఆర్చరీ క్రీడాకారుడు అనుదీప్ పతకాన్ని సా ధించి నట్లు కోచ్ ప్రతాప్‌దాస్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ రాజస్థాన్‌లో జరిగిన ఆర్చరీ జాతీయ స్థాయి పోటీల్లో రికర్వ్ విభాగంలో అనుదీప్ మంచి ప్రతిభాపి బ్రౌంజ్ మెడల్ సాధించాడని అన్నారు. కాగా జాతీ యస్థాయిలో పతకాన్ని సాధించిన క్రీడాకారుడిని భిక్క నూరు, దోమకొండ మండలాల ప్రజాప్రతినిధులు, నాయ కులు, ఆర్చరీ క్రీడాకారులు అభినందించారు.



అనుదీప్

కాంగ్రెస్‌లో చేరిన సుంకెట్ గంగపుత్ర సంఘ సభ్యులు

మోర్తాడ్, జనవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకెట్ గ్రామంలో మత్స్య సహకార సంఘ సభ్యులు ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనకు ఆకర్షితులై ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రజాపాలనకు మద్దతుగా సునీల్‌కుమార్ నాయకత్వంలో పని చేయుటకు కాంగ్రెస్ పార్టీలో చేరామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుద ముత్యాల రాములు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ చెక్‌డ్యాంలో దొరికిన అరుదైన చేప

వేల్పూర్, జనవరి5(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ చెక్‌డ్యాంలో ఆదివారం నిండ నీటితో ఉన్న చెక్‌డ్యాంలో గంగపుత్రులు చేపలు పడుతుండగా 15కేజీల అరుదైన బొచ్చచేప చిక్కడంతో గంగపుత్రుడు బండి కిషన్ ఆనందం వ్యక్తం చేశారు. ఈసంద ర్భంగా గంగపుత్రుడు మాట్లాడుతూ సుమారు 25ఏళ్ల నుంచి చేపడుతు న్నానని ఇటువంటి పెద్ద చేప చిక్కడం ఇదే మొదటిసారి అన్నారు.



- వేల్పూర్ చెక్‌డ్యాంలో గంగపుత్రుడికి దొరికిన అరుదైన 15కేజీల చేప

జాన్కంపేట్‌లో మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, జనవరి5(ఆంధ్రజ్యోతి):జాన్కంపేట్ గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన బంగాలి రవి కుటుంబాన్ని ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడు రవి కుటుంబ పరిస్థితిని స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న సునీల్‌కుమార్ వారి అనుచరులు రవి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక సహ యం అందించిన సునీల్‌కుమార్‌కు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గల్ఫ్ మృతుడికి అంత్యక్రియలు

కమ్మర్‌పల్లి,జనవరి5:(ఆంధ్ర జ్యోతి) మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన అల్లకొండ ముత్తన్న (55) ఉపాధి నిమిత్తం దుబాయి దేశం వెళ్లగా గత డిసెంబరు 13న తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించాడు. కాగా మృతదేహం ఆదివారం స్వగ్రామం చేరడంతో కుటు ంబసభ్యులు అశ్రునయనాలతో అంతక్రియలు నిర్వహించారు. అల్లకొండ ముత్తన్న మృతదేహం గల్ఫ్‌కార్మికుల రక్షణ సమితి అధ్యక్షుడు నరసింహం సహకాంతో స్వగ్రామం చేరింది. మృతుడికి భార్య లావణ్య, కొడుకులు శ్రీనాథ్, ఉన్నారు.



ముత్తన్న మృదేహం

చాత్తాద శ్రీవైష్ణవ సంఘు క్యాలెండర్ ఆవిష్కరణ

ఆర్మూర్‌రూరల్,జనవరి5(ఆంధ్రజ్యోతి):ఆర్మూర పట్టణంలోని శ్రీవైష్ణవ సంఘ భవనం లో ఆదివారం చాత్తాద శ్రీవైష్ణవ సంఘ క్యాలెండర్‌ను ఎస్సై తిరునగరి గోవింద్, స్థానిక కౌన్సిలర్ గంగామోహన్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్య క్షుడు డివిఎస్.చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి అసూరి గోవిందరాజస్వామి, కోశాధికారి దయా సాగర్, గౌరవ అధ్యక్షుడు చిన్నయ్య, సంఘ సభ్యులు నర్సింహచారి, జేవీసీ.ప్రకాష్, రవి కాంత్, శేషరాజు బాస్కర్, కిరణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీవైష్ణవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై, కౌన్సిలర్

బాధిత కుటంబాలకు పరామర్శ

కమ్మర్‌పల్లి, జనవరి 5:(ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండలంలోని పలు గ్రామాలో బాదిత కుటంబాలను బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి ఆదివారం పరమార్శించారు. మండలంలోని నాగాపూర్ గ్రామంలో పాముకాటుకు గురై జమున అనే మహిళ మరణించిగా ఆమె కుటుంబసభ్యులను సునీల్ కుమార్ పరమార్శించారు. కిడ్నీ సంబంధిత వ్యాదితో బాదపడుతు ఇటీవలే బషీరాబాద్ గ్రామ సర్పంచ్ సక్కరం అశోక్ మరణించడంతో ఆయాన కుటుంబాన్ని, అదేగ్రామానికి చెందిన మునుగంటి నర్సయ్య మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను పరమార్శిచారు. ఆయన వెంట మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు బుచ్చిమల్లయ్య, వేముల గంగారెడ్డి, శ్రీరాముల మురళి, కస్తూరి శ్రీనివాస్, జైడి శ్రీనివాస్, సక్కరం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్‌ను పరామర్శ

టీజీఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ మామ ఇటీవల కోరుట్లలో మృతిచెందడంతో ఆయన స్వగ్రామం కోరుట్ల వెళ్లి ఈరవత్రి అనిల్‌ను బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట జిల్లా నాయకులు సుంఎట రవి, పడిగెల ప్రవీన్, తక్కూరి దేవేందర్, పాలెపునర్సయ్య, సుంకెట బుచ్చన్న, అబ్దుల్ రఫీ, అజారోద్దీన్ , మెహన్ నాయక్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోకోకోలా కంపెనీకి విద్యార్థుల ఎంపిక

మాక్లూర్, జనవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయ్‌రూరల్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు యాక్సిందర్ హిందుస్థాన్ కోకోకోలాకు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆదివారం కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు ఎల్లప్పుడు ప్రతిభను నిరూపించుకున్నారని, కళాశాలలో అందిస్తున్న విద్యప్రమాణాలు, శిక్షణ విలువలను ప్రతిబింబిస్తోందన్నారు.ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు.ఈకార్యక్రమంలో ప్లేస్ మెంట్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్,సిబ్బంది పాల్గొన్నారు.

7న నవీపేటలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక

నవీపేట,జనవరి5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న మండల కేంద్రంలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఉదయం 10:30గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు నవీపేట 33/11సబ్ స్టేషన్ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. నవీపేట, జన్నేపల్లి సెక్షన్ పరిధిలోని గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.



నిజామాబాద్‌లో ముగ్గుల పోటీలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకుంటున్న యువతులు



కామారెడ్డిలో రెండో బహుమతి గెలుపొందిన బాన్సువాడకు చెందిన నవనీత



● బోధన్‌లో ముగ్గులు వేస్తున్న యువతులు



బోధన్‌లో ద్వితీయ విజేత లతకు నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



నిజామాబాద్‌లో ముగ్గులు వేస్తున్న యువతులు



కామారెడ్డిలో మూడోబహుమతి గెలుపొందిన కామారెడ్డికి చెందిన కే.అశ్విని



నిజామాబాద్‌లో రెండో బహుమతిని అందుకుంటున్న భవాని



నిజామాబాద్‌లో మూడో బహుమతిని అందుకుంటున్న పూజిత



బోధన్‌లో తృతీయ విజేత రాణికి నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఇలపై హరివిల్లు

'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ము త్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' వారి ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రం, బోధన్ డివిజన్ కేంద్రంతో పాటు కామారెడ్డి జిల్లా కేంద్రంలోనూ అట్టహాసంగా జరిగాయి. ముత్యాల ముగ్గు పోటీలకు విశేష స్పందన లభించింది. పోటీల్లో పాల్గొనేందుకు యువతులు, మహిళలు భారీగా తరలివచ్చారు. ముత్యాల ముగ్గులేసి.. అందులో రంగులు అద్దారు. పాల్గొన్న యువతులు, మహిళలకు అతిథులు బహుమతులను అందజేశారు.

● ఆంధ్రజ్యోతి నిజామాబాద్ / కామారెడ్డి/ బోధన్





ముగ్గులను పరిశీలిస్తున్న ముఖ్యఅతిథి తాహెర్



నిజామాబాద్‌లో ముగ్గులు వేస్తున్న యువతులు



ముగ్గుల విశిష్టతను వివరిస్తున్న రచయిత శారద హన్మాండ్లు







వేదికపై మాట్లాడుతున్న తాహెర్‌బిన్ హందాన్



బోధన్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న ఆంధ్రజ్యోతి నిజామాబాద్ బ్రాంచి మేనేజర్ తిరుపతిరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి గుడ్ల సంజీవ్, బ్యూరో సంపత్



బోధన్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలో ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



నిజామాబాద్‌లో ముగ్గుల పోటీ విజేతలతో అతిథులు, ఆంధ్రజ్యోతి సిబ్బంది



నృత్యం చేస్తున్న పోటీలో పాల్గొన్న యువతులు



కామారెడ్డిలో ముగ్గులు వేస్తున్న మహిళలు



నిజామాబాద్‌లో ముగ్గుల పోటీకి హాజరైన యువతులు, మహిళలు





కామారెడ్డిలో ముగ్గులు పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు



కామారెడ్డిలో ముగ్గుల పోటీకి హాజరైన యువతులు, మహిళలు



ముగ్గులను పరిశీలిస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది



కామారెడ్డిలో ముగ్గు వేస్తున్న మహిళ

సప్తవర్ణ శోభితం

(ఐదో పేజీ తరువాయి)

అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ సంప్రదాయాల్లో ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఆడపిల్లలు ప్రతీరోజు చేసేటువంటి పనులలో ఎన్నో వ్యాయామ సూత్రాలు దాగి ఉన్నాయని అన్నారు. సంక్రాంతి పర్వదినం రోజులలో ప్రతీరోజు ఇంటి ముందర వేసే చుక్కల ముగ్గులు, చుక్కలను కలపడం అంటే ఒకరితో ఒకరు బంధాలను కలుపుకోవడమని అన్నారు. నాటి కాలంలో ముగ్గులను వేయడానికి సంక్రాంతి పర్వదినానికి 15 రోజుల ముందే సిద్ధమయ్యేవారమని ప్రత్యేకంగా పట్టించిన పిండితోనే ముగ్గులు వేసేవాళ్లమని అన్నారు. ఆత్మీయ అనుబంధాలకు పండుగలు, పర్వదినాలు వేదికగా నిలుస్తాయని, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీ సంక్రాంతి పర్వదినానికి వేదికగా నిలిచిందని అన్నారు. మహిళలు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగపర్చుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. న్యాయనిర్ణేతగా వ్యవహరించిన కవయిత్రి వసంత లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రతియేటా మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించడం వల్ల వారిలో సృజనాత్మకతను వెలికితీసిన వాళ్లము అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ తిరుపతిరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి గుడ్ల సంజీవ్, బ్యూరో ఇన్‌చార్జి సంపత్‌రావు, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ శ్రీపతి, ఎస్ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్, ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి లక్ష్మణ్‌గౌడ్, అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్వర్, సర్క్యులేషన్ ఇన్‌చార్జి భాస్కర్, సబ్ ఎడిటర్లు రమేష్, నర్సింగ్‌రావు, సుభాష్‌చంద్ర, స్వామి, రాకేష్, సీనియర్ ఫొటోగ్రాఫర్ రతన్‌రెడ్డి, ఆర్సీ ఇన్‌చార్జి ఆంజనేయులు, ఏబీఎన్ కెమెరామన్ అనిల్, రిపోర్టర్లు లింగం, నారాయణ, సాబిక్, గంగాధర్, రవీంద్రశాలి, దశరథ్, నర్సింహామూర్తి, గంగాధర్, ఎడిటోరియల్ అసిస్టెంట్ రవి, సిబ్బంది బాలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజేతలకు నగదు అందజేత..

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలుగా నిలిచిన మహిళలకు ముఖ్య అతిథి తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ నగదు, మెమోంటోను అందజేశారు. ముత్యాల ముగ్గు పోటీలో మొదటి స్థానంలో నిలిచిన హీరావాసంకు మెమోంటోతో పాటు రూ.6వేల నగదును అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన భవానికి రూ.4వేల నగదుతో పాటు మెమోంటోను, మూడో స్థానంలో నిలిచిన పూజితకు రూ.3వేల నగదుతో పాటు మెమోంటోను అందజేశారు. పోటీలో పాల్గొన్న వారికి ప్రత్యేక బహుమతులను అందజేశారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నాం

(ఐదో పేజీ తరువాయి)

రిజర్వేషన్లను రద్దు చేయలేరని ఆయన అన్నారు. గతంలో అమిత్‌షా ముస్లింల రిజర్వేషన్లపై మాట్లాడిన వ్యాఖ్యలను ఆయన గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న 4 శాతం రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం మాత్రమే తుదినిర్ణయం తీసుకుంటుందన్నారు. ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని నేటికి రిజర్వేషన్లపై కోర్టులో పోరాడుతూనే ఉన్నానని అన్నారు. ముస్లిం రిజర్వేషన్ల వల్ల వేలాది మంది ముస్లిం మైనార్టీ యువకులు ఇంజనీర్లు, డాక్టర్లుగా మారారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ రిజర్వేషన్ల కోసం కృషి చేసిన షబ్బీర్ అలీని ముస్లిం ప్రముఖులు సన్మానించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ...

నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన చేతుల మీదుగా పలువురికి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశవేణు, నాయకులు రత్నాకర్, ఖుద్దూస్, మాజిద్‌ఖాన్, మిస్బా, తదితరులు పాల్గొన్నారు.

కెప్టెన్ హబ్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

సుభాష్‌నగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడిని దూరం చేస్తూ శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని, సహృద్భావ వాతావరణానికి బాటలు వేస్తాయని నగరంలోని కెప్టెన్ బ్యాడ్మింటన్ హబ్ ఆధ్వర్యంలో మెన్స్ డబుల్స్ ఉమ్మడి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 2025 క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుండి 73 జట్లు పాల్గొన్నాయి. కెప్టెన్ బ్యాడ్మింటన్ హబ్ నిర్వాహకులు కిరణ్, ఎన్‌జీఎస్ సంతోష్ పోటీలను ప్రారంభించారు. అనునిత్యం దైనందిన కార్యకలాపాలలో నిమగ్నమై ఉండే వివిధ వర్గాల వారికి మానసికోల్లాసానికి అందించేందుకు క్రీడలు ఉపకరిస్తాయని అన్నారు. ఈదిశగా కెప్టెన్ బ్యాడ్మింటన్ హబ్ సీనియర్ క్రీడాకారులు పసుల అర్వింద్, షాదుల్లా ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను నిర్వహిస్తుండటడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. నేటి తరం ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యతను ఇస్తూ క్రీడలు, వ్యాయామాలు, యోగా వంటి అభిరుచులను అలవర్చుకుంటున్నారని అన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ట్రోఫీతో పాటు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లన్న, రాజు, శౌరబ్, విజయ్, శ్రీనివాస్, వంశీ పాల్గొన్నారు.

చెవిలో పూలు పెట్టుకొని హమాలీల నిరసన

డిచ్‌పల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 5వ రోజు చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హమాలీ ప్రతినిధి మోహన్, గౌస్, దిలీప్ మాట్లాడుతూ.. హమాలీలు రాష్ట్ర కమిషనర్‌తో కుదిరిన వేతనల ఒప్పంద జీవోను విడుదల చేయాలని క్వింటాల్‌కు రూ.26 నుంచి రూ.29 పెరిగిన రేట్లను ఏడాది నుంచి ఏరియస్‌తో కలిపి అందజేయాలన్నారు. హమాలీలకు, స్వీపర్లకు రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు.

గడీల పాలన వద్దని కాంగ్రెస్‌కు పట్టం కట్టారు

- హామీలన్నింటినీ నెరవేరుస్తున్నాం
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజలు బీఆర్ఎస్ పాలనను వద్దనే కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, ఇచ్చిన హామీలను నెర వేర్చే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తుందన్నారు. గడీల పాలనను కాదని ప్రజలు మార్పు కోరుకొని కాంగ్రెస్‌ను గెలిపించారని అన్నారు. ఈ సంవత్సరం కాలంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో పాటు విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచామని అన్నారు. ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పంట పండించే రైతులందరికి ఎకరాకు రూ.12వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం 20వేల కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. జనవరి 26 నుంచి రేషన్ కార్డులను కూడా ప్రభుత్వం ఇవ్వనుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం 7లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. కాంగ్రెస్ పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు అన్నింటిని స్తబ్దుగా ముందుకు పోతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ కవిత బీసీల గురించి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. అవినీతి పాలన చేసిన కేటీఆర్ జైలు వెళ్లడంకాయమని ఆయన అన్నారు. బీజేపీ టూటా పార్టీ అని ఆయన విమర్శించారు. పసుపు బోర్డు హామీ ఇచ్చిన ఇప్పటి వరకు అతీ గతీ లేదన్నారు. బీజేపీ సర్కార్ నల్ల చట్టాలను తెచ్చి 6వేల మందిని పొట్టనబెట్టుకుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత శేఖర్‌గౌడ్, భోజన్న, భాగర్తి భాగారెడ్డితో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

అవమానించిన అత్తను హత్య చేసిన అల్లుడు!

- సారంగపూర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ సురేష్‌కుమార్

ఖిల్లా, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తరచూ నీవు దొంగ అంటూ ఇంటికి రావద్దని అవమానించిన అత్తను అల్లుడు హత్య చేశాడు. ఈ నెల 3న నిజామాబాద్ నగర శివారులోని సారంగపూర్‌లో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ సురేష్‌కుమార్ ఆదివారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో వివరాలను వెల్లడించారు. ఈనెల 3న రాత్రి సమయంలో సారంగపూర్ గ్రామంలో దుబ్బాక సాయమ్మను అల్లుడు లక్ష్మణ్ ముందుగా లేస్‌తో ఉరివేసి స్పృహ తప్పిన ఆమెపై రోకలిబండతో కొట్టి హత్య చేశాడని తెలిపారు. సాయమ్మ కూతురు ఫిర్యాదు చేయడంతో లక్ష్మణ్‌పై అనుమానంతో రెండు రోజులుగా గాలించి ఆదివారం సారం గపూర్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. లక్ష్మణ్‌పై 30 కిపైగా దొంగతనాల కేసులు ఉన్నాయని అన్నారు. సారంగపూర్‌లోనే ఉండే రెండవ కూతురు భర్త అయిన లక్ష్మణ్‌ను ఇంటికి రావొద్దని కరాఖండిగా చెప్పడంతో పాటు నీవు దొంగవని పలుమార్లు అనడంతో ఆమెను హత్య చేయాలని లక్ష్మణ్ నిర్ణయించుకున్నాడని సీఐ తెలిపారు. పథకం ప్రకారమే రాత్రివేళలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లోకి ప్రవేశించి హత్యచేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించుకుపోయా డని తెలిపారు. ఎక్కడా కూడా ఆనవా ళ్లను పోలీసులు గుర్తించకుండా చెరిపే ప్రయత్నం చేశారని అన్నారు. లక్ష్మణ్‌ను అరెస్టు చేసి బంగారు ఆభరణాలను రికవరీ చేశామని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో 6వ టౌన్ ఎస్సై వెంకట్రావు, మోపాల్ ఎస్సై యాదగిరి గౌడ్‌లను ఏసీపీ అభినందించినట్లు సీఐ తెలిపారు.

మేధావుల సంఘీభావ సభను జయప్రదం చేయాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న నిర్వహించే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మేధావుల సంఘీభావ సభను జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సమైఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిల్మల సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్అండ్‌బి అతిథిగృహంలో సంఘీభావ సభ కరపత్రాలను విడుదల చేశారు. ఫిబ్రవరి 7న లక్ష డప్పులు, వెయ్యి గొంతుకలతో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఈనెల 11న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో మేధావుల సంఘీభావ సభను నిర్వహిస్తున్నామని కావున జిల్లాలోని మాదిగ, ఉపకులాల ఉద్యోగస్తులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంతవరకు మేధావివర్గం సామాజిక బాధ్యతగా స్వీకరించి ఎంఆర్‌పీఎస్ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు నాంపల్లి, తెడ్డు గంగారాం, మహేష్‌కుమార్, రమేష్, శ్రీనివాస్, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కార్మికుడికి ఇందిరమ్మ ఆత్మీయ భృతి ఇవ్వాలి

నిజామాబాద్ కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):

అసెంబ్లీ ఎన్నికల్లో అనేక వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రతీ కార్మికుడికి ఇందిరమ్మ ఆత్మీయ భృతి ఇవ్వాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రివర్గంలో తీర్మానం చేసిన ప్రకారం ప్రతీ కుటుంబానికి కాకుండా ప్రతీ కార్మికుడికి ఇందిరమ్మ ఆత్మీయ భృతి అందించాలని అన్నారు. రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చి గెలిచిన సంవత్సరం తర్వాత భృతిని ఇస్తామని చెప్పడం మోసపూరితమని అన్నారు. రాష్ట్రంలో 60లక్షల మంది కూలీలు పనిచేస్తుంటే కేవలం 12లక్షల మందికి మాత్రమే భృతి అందించి చేతులు దులుపుకుంటుందని అన్నారు. రూ.15వేలు కాకుండా రూ.12వేలకే భృతి అందించడం రైతు కూలీలను మోసగించడమేనని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కుతున్నారని అన్నారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కేబుల్ వైర్లు అపహరణ

డిచ్‌పల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట (నర్సింగపూర్)లో ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని దొంగలు వ్యవసాయ పంపు సెట్లు ధ్వంసం చేసి విద్యుత్ వైర్లను చోరీ చేశారు. ఈ మేరకు బాధితులు ఎస్సైకి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గొల్ల శంకర్, కుర్మ రాజేశ్వర్, రవి, ఎర్రన్న, ప్రవీణ్, ఇద్దరు గిరిజన రైతుల పంపు సెట్లలోని కేబుల్ వైర్లు దొంగలు చోరీ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ 2025 సంవత్సరం క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్, ప్రధాన కార్యదర్శి అర్వింద్ తదితరులు పాల్గొని డీఈవోతో విద్యారంగ సమస్యలపై చర్చించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి పాఠశాలలో ఉన్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కారుణ్య నియామకాలపై అదే విధంగా పీఆర్సీ, కరువుభత్యం తదితర అంశాలను డీఈవోతో మాట్లాడారు. విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, భారతి, ఇబ్రహీం, గంగాప్రసాద్, లింబయ్య, తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలి'

నిజామాబాద్ కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పి రైతు భరోసా రూ.15వేలు అందించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు పంటలకు రూ.15వేలు అందించాలని అన్నారు. ఆరు గ్యారంటీలో పాటు ఏడవ గ్యారంటీ ప్రజాస్వామ్య పరిరక్షణ అంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి లగచర్ల రైతులకు బేడీలు వేసి ఏడవ గ్యారంటీ ఎగనామం పెట్టారని రైతుల ఘోస చెప్పుకోవడానికి సైతం సమయం ఇవ్వకుండా ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రైతులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి వర్గంలో రైతుభరోసాను రూ.15వేలు కాకుండా రూ.12 వేలకు కు దించడం అన్యాయమని, మోసం అని కౌలు రైతులకు ఇచ్చిన హామీ సైతం తుంగలో తొక్కారన్నారు. రాష్ట్రంలో రూ.2లక్షల రుణమాఫీ కానివారు 15లక్షల మంది రైతుల వరకు ఉన్నారని వారికి రుణమాఫీ చేసే విధంగా చూడాలని అన్నారు.



హాజరైన పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నిజామాబాద్ అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాందేవ్‌వాడలోగల రావూజీ వంజరిసంఘం ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 30 సంవత్సరాల తర్వాత ఆ పాఠశాలలో జరిగిన పూర్వవిద్యార్థులంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. ఆనాడు చదువుచెప్పిన గురువులను ఘనంగా సత్కరించి మధురజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న అందరికి భగవద్గీత గ్రంథాన్ని ప్రదానం చేశారు.

'సంక్రాంతికి వస్తున్నాం' ట్రైలర్ లాంచ్‌కు ముస్తాబవుతున్న పాత కలెక్టరేట్ మైదానం

నిజామాబాద్ కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని విడుదల అవుతున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ట్రైలర్ లాంచ్‌కు జిల్లా పాత కలెక్టరేట్ మైదానం ముస్తాబవుతుంది. ఆదివారం ఏర్పాట్లను ఎస్‌వీసీ మేనేజర్ నాగేశ్వర్‌రావు, నరాల సుధాకర్ సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు, శిరీష్‌రెడ్డి నిర్మాతగా నిర్మించిన సంక్రాంతికి వస్తున్నాం ట్రైలర్ సోమవారం ఆవిష్కరించనున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి చిత్రయూనిట్ అంతా హాజరవుతారని అభిమానులు సమ్యమనంతో పాటించి విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మోపాల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం బోర్గాం(పి) కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరికి చెక్కులను పంపిణీ చేశారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశాల మేరకు చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని శేఖర్‌రెడ్డి తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. మనమందరం కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూడలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు రమేష్‌రెడ్డి, కల్లెడి అశోక్, మహేందర్‌రెడ్డి, సాయిలు, పసూల శ్రీను, సుభాష్, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

శాలివాహనులు రాజకీయంగా రాణించాలి

ధర్పల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శాలివాహనులు రాజకీయంగా ఇంకా వెనుకబడి ఉన్నారని శాలివాహనుల మండల అధ్యక్షుడు రాజేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని దుబ్బాక గ్రామంలో మండల శాలివాహనుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి శాలివాహనులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కవయిత్రి మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో శాలివాహనులు సత్తా చాటలని అన్నారు. నిరక్షరాస్యత కారణంగా శాలివాహనులు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారని మొదటగా అందరూ అక్షరాస్యత సాధించవల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న శాలివాహనులను ముందువరుసలో నిలిపేందుకు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాములు, గంగాధర్, లింగన్న, రంజిత్, గంగరాజం, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ధర్పల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్ సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసానికి పాల్పడుతున్నారని ఎస్సై రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్ అనే పద్ధతి లేదని పోలీసు అధికారులు ఎవరూ వీడియోకాల్స్ చేయరని ఆయన చెప్పారు. వీడియోకాల్‌లో విచారణ అంటే మోసమేనని ఆయన చెప్పారు. సైబర్ మోసగాళ్లు చేస్తున్న కొత్తతరహా మోసం అని ఆయన చెప్పారు. సైబర్ నేరాలపై ఇతరులకు సైతం అవగాహన కల్పించాలని సూచించారు. వర్క్‌ఫ్రమ్ హోం అనే ప్రకటనలను నమ్మవద్దని సూచించారు. డాటా ఎంట్రీ, క్యాప్చవర్క్‌పై క్లిక్ చేయవద్దని చెప్పారు. డ్రగ్స్‌తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దని మాదకద్రవ్యాలు భవిష్యత్తును అంధకారం చేస్తాయని అన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. అపరిచిత నెంబర్ల నుంచి మీ అకౌంట్‌లోకి డబ్బులు వస్తే జాగ్రత్తగా ఉండాలన్నారు. మెస్సేజ్‌లో కనిపించే లింక్‌లు క్లిక్ చేయవద్దని చెప్పారు. సైబర్ మోసగాళ్లు కొత్త తరహాలో చేస్తున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. మోసాలకు ఎవరైనా గురైతే 1930 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

కష్టసుఖాలు భగవంతుని నిర్ణయం

నిజామాబాద్ కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జీవితంలో కష్టసుఖాలు భగవంతుని నిర్ణయాలు అని వాటిని అధిగమించి ముందుకు సాగినప్పుడే స్వామి అనుగ్రహం లభిస్తుందని కలకుంట్ల శ్రీధరాచార్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జెండా బాలాజీ మందిర్ ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా భక్తులనుద్దేశించి తిరుప్పావై ప్రవచనం చేశారు. భగవంతుడు భక్తులను అనుగ్రహించడానికి వైకుంఠం నుండి భువికి వచ్చాడని అందుకు నిదర్శనం గోదాదేవి పాటించి రంగనాథున్ని వివాహం చేసుకోవడమేనని అన్నారు. భగవంతుని కృపకు ప్రతి ఒక్క భక్తుడు పాత్రుడేనని ఆయనకు కులమతాలతో సంబంధం లేకుండా అందరిని అనుగ్రహిస్తాడని అన్నారు. గోదాదేవి ప్రతిరోజు తన తోటి స్నేహితురాళ్లతో కలిసి భగవత్ ఆరాధనలో గడిపారని తద్వారా మానవాళికి సుసాధ్యం అంటూ ఏదీ లేదని ధనుర్మాస వ్రతం ద్వారా తెలియజేశారని అన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వెలగలేటి నాగరాజాచార్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.160	రూ.275	రూ. 295
వెన్‌కాబ్(కిలో)	రూ.165	రూ.280	రూ. 300

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.79600	రూ.73450	రూ.930

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : పుష్ప-2 (10.20, 2.45)
: మార్కో (7.10)
: ముఫాసా (ఇంగ్లీష్ 3డి) (10.15)
స్క్రీన్-2 : ముఫాసా (తెలుగు 3డి) (11.00, 1.50, 4.40, 7.30)
: పుష్ప-2 (10.20)
స్క్రీన్-3 : మార్కో (11.05)
: పుష్ప-2 (హింది) (2.10)
: పుష్ప-2 (తెలుగు) (6.15)
: బేబీజాన్ (హిందీ) (10.40)
స్క్రీన్-4 : కార్వన్ ది హంటర్ (ఇంగ్లీష్) (11.00, 5.00)
: మార్కో (1.55, 10.50)
: కార్వన్ ది హంటర్ (తెలుగు) (7.55)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మ్యాక్స్ (10.25, 1.20, 10.30)
: మార్కో (4.10)
: పుష్ప-2 (7.00)
స్క్రీన్-2 : ముఫాసా (11.00, 120)
: పుష్ప-2 (3.50)
: మార్కో (7.45, 10.30)
స్క్రీన్-3 : పుష్ప-2 (1.10, 10.00)
: ముఫాసా (తెలుగు 3డి) (5.00, 7.30)

దేవి : మార్కో (11.00, 2.00, 6.00, 9.00)
నటరాజ్ : మ్యాక్స్ (2.00, 9.00)
: కార్వన్ ది హంటర్ (11.00, 6.00)
విజయ్ : పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)
లలితామహల్ : యుఐ (11.00, 2.00, 6.00, 9.00)

- నిజామాబాద్ అర్బన్